# పంటలపై ఏనుగుల దాడి

బంగారుపాళ్యం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:



ముంగరమడుగు అటవీ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాలపై శనివారం రాత్రి ఏనుగుల గుంపు పడ్డాయి. మామిడి, అరటి పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. మామిడి తోటల్లోని మామిడి చెట్ల కొమ్మలను విరిచివేసి తొక్కి పడేశాయి. గ్రామానికి చెందిన రైతులు కృష్ణమూర్తి, రాజయ్యల అరటి, మామిడి పంటలు ధ్వంసం అయ్యాయి. ఈ మేరకు బాధిత రైతులు అటవీ శాఖ అధికారులకు వినతి చేశారు. ఏనుగుల ద్వారా జరిగిన నష్టంను ప్రభుత్వ పరంగా అందజేయాలని కోరారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## కమ్మేసిన పొగమంచు



నారాయణవనం హైవేను కప్పేసిన పొగమంచు — ప్రభాతవార్త, నారాయణవనం



### వైకుంఠద్వాదశిన సంతృప్తిగా

# భక్తులు వైకుంఠద్వార దర్శనం

తిరుమల, డిసెంబర్ 24(ప్రభాతవార్త)ప్రతినిధి:

తిరుమలేశుని ఆలయంలోపల పవిత్రమైన వైకుంఠద్వారంలో రెండవరోజు వైకుంఠ ద్వాదశి పర్వదినాన ఆదివారం సామాన్యభక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్లు కలిగినవాళ్ళు, ఆఫ్‌లైన్‌లో సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు పొందిన వాళ్ళు తెల్లవారుజాము నుండి ఆలయంలోనికి చేరుకుని పవిత్రమైన వైకుంఠద్వారంలో ఏడుకొండల వేంకటేశ్వరుని దర్శించుకున్నారు. ఆలయంలోపల ఏర్పాట్లు అదరహో అన్నట్లు భక్తులను మరింత ఆధ్యాత్మికంగా ముగ్దుల్ని చేస్తోంది.

# వైభవంగా "చక్రధారుడి చక్రస్నానం"

### -ద్వాదశి పర్వదినాన భక్తుల పుణ్యస్నానాలు



తిరుమల, డిసెంబర్ 24(ప్రభాతవార్త)ప్రతినిధి:

ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంకు సమీపంలోని పవిత్ర పుష్కరిణిలో ఆదివారం ఉదయం చక్రత్తాళ్వార్‌కు ఆలయ అర్చకులు వేదోక్తంగా చక్రస్నాన మహోత్సవం నిర్వహించారు. వైకుంఠ ద్వాదశి పర్వదినాన ఈ వేదోక్తం జరిపించారు. ఆదివారం ఉదయం 4.30 గంటల నుండి 5.30గంటల వరకు చక్రధారుడి చక్రస్నాన మహోత్సవం వైభవంగా ముగిసింది. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. ఆలయ అర్చకులు, జీయంగార్లు ఉపనిషత్తు మంత్రములు, దశశాంతి మంత్రములు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తంవంటి పంచసూక్తమంత్రములు, దివ్యప్రబంధంలోని అభిషేకసమయంలో అనుసంధానంచేసే వేదాలను టిటిడి వేదపారాయణదారులు పారాయణంచేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయంగారు, చిన్నజీయంగారు, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇ.ఓ ఏవి ధర్మారెడ్డి, సివిఎస్ఓ నరసింహకిశోర్, పాలకమండలి సభ్యులు, ఆలయ డిప్యూటీ ఇవో లోకనాథం, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. తిరుపతి, తిరుచానూరు, శ్రీనివాసమంగాపురంలోని ఆలయాల్లో కూడా ద్వాదశిన చక్రస్నానమహోత్సవాలు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

### క్రిస్మస్ వేడుకలకు

# సర్వం సిద్ధం



నేడు క్రిస్మస్

ముస్తాబైన లూథరన్ చర్చి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త

పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పండగలకు నిలయం. కుల మతాలు, వర్గ భేదాలు విస్మరించి ఏమతానికి సంబంధించిన పండగ వచ్చినా అందరూ కలసి మెలసి జరుపుకోవటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో నేడు క్రిస్మస్ పండగను జరుపుకోనున్నారు. మళ్ళీ కోవిడ్ నిబంధనలు అమలు జరగనుండగా భక్తి భావం తొణికిసలాడుతుంది. సోమవారం క్రిస్మస్ రావటంతో యువకుల్లో జోష్ చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి నుంచే పట్టణంలోని క్రైస్తవ సోదరుల ఇళ్ళ వద్ద సందడి చోటు చేసుకుంది. వారం రోజులుగా వివిధ చర్చిల్లో ప్రార్థనలు, ఉపవాసదీక్షలు సాగుతున్నాయి. ప్రతి రోజూ పట్టణంలో ప్రదర్శనలు జరుపుతున్నారు. క్రీస్తు జననంకు సంబంధించి పాటల్ని ఆలపిస్తూ భక్తిభావాన్ని కల్పిస్తున్నారు. క్రైస్తవులు కాపారాలుంటున్న ఇళ్ళకు నక్షత్రాల వెలుగుల్ని నింపారు. ఇక ప్రార్థనాలయాల్ని ఎంతో చక్కగా దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. పండగ వాతావరణం చోటు చేసుకుంది. అప్పుడే శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. రాత్రికే చర్చిల్లో భక్తులు నిండారు. క్రీస్తు జననానికి సంబంధించి పఠిస్తున్నారు.

**వేడుకలకు ముస్తాబైన ప్రార్థనాలయాలు:**

క్రిస్మస్ వేడుకలకు శ్రీకాళహస్తి పట్టణంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ప్రాచీన చరిత్ర, మతసామరస్యాన్ని కలిగి ఉన్న లూథరన్‌చర్చి, పునీతశౌరివారి చర్చి(కాథలిక్‌చర్చి), ఇసిఐ, పెంతెకోస్తు, ఎల్ఇఎఫ్, బెతస్త్రప్రార్థనామందిరాలు, జెరూసలెంచర్చి, భక్తసింగ్‌చర్చి, పానగల్‌లోని చర్చి, ఎన్‌టిఆర్ నగర్, చెంచులక్ష్మి కాలనీ, ఎంజిఎం పక్కన చర్చి, తెట్టు వద్ద ఉన్న ప్రార్థనామందిరాలను విద్యుత్‌దీప కాంతులతో దేదీప్యమానంగా అలంకరించారు. ఎటు చూసినా క్రిస్మస్ సంబరాలు, కొనుగోళ్ళుతో పట్టణం కళకళలాడింది. పునీతశౌరివారి చర్చి వద్ద ఏసుక్రీస్తు జననాన్ని సవివరంగా తెలియజేసే రూపాలను మట్టిబొమ్మలతో ఆకర్షణీయంగా మలచడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పునీతశౌరివారి చర్చిలో ఉన్న మేరీమాత విగ్రహానికి ప్రత్యేకాలంకరణ చేపట్టారు. క్రైస్తవ సోదరుల ఇంటిపై నక్షత్ర వెలుగులు విరజిమ్ముతున్నాయి. నేడు జరిగే క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరం నిర్వాహకులు చేస్తున్నారు. ఇక ప్రాచీన చరిత్ర కలిగిన లూథరన్‌చర్చి విద్యుత్‌కాంతులీనుతోంది.

### గూడూరు హైవేపై

# భారీగా నగదు పట్టివేత

**- రూ.55 లక్షల 87 వేల 80 రూపాయలు స్వాధీనం**

**- వాహనాలు తనిఖీలు చేపట్టిన రూరల్ సిఐ దశరధరామారావు**



గూడూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త

ఎలాంటి పత్రాలు లేకుండా గూడూరు జాతీయ రహదారిపై పిడుగురాళ్ళ నుంచి చెన్నైకి వెళుతున్న బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి భారీగా నగదు పట్టుబడింది. ఇద్దరు వ్యక్తులను గూడూరు రూరల్ సిఐ దశరధరామారావు, పోలీసు సిబ్బందితో కలిసి ఆదివారం గూడూరు రూరల్ పరిధిలో హైవేలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.55 లక్షల 87 వేల 80రూపాయలు నగదుతో సహా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు గూడూరు డిఎస్పీ ఎం.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం గూడూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి రూరల్ పోలీసుస్టేషన్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. రూరల్ సిఐ దశరధరామారావు సిబ్బందితో కలిసి ఆదివారం గూడూరు బైపాస్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో హైదరాబాద్ బస్సులో పిడుగురాళ్లలో బస్సు ఎక్కి చెన్నైకి వెళుతున్న ఇద్దరి వద్ద నుంచి ఎలాంటి పత్రాలు, బిల్లులు లేకుండా ఉన్న 55 లక్షల 87 వేల 80 రూపాయల నగదు తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు తనిఖీలు చేసినట్లు తెలిపారు. బస్సు సీటు కింద ఉన్న బ్యాగును పరిశీలించి ఆ వ్యక్తుల నుంచి వివరాలు అడిగితే సరైన సమాచారం లేదన్నారు. దాంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం గూడూరు డిఎస్పీ రూరల్ సిఐ దశరధరామారావును, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. వీరికి రివార్డులు ప్రదానం చేసేందుకు ప్రత్యేకంగా ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు.

# ప్రజలు మెచ్చే పరిపాలన అందిస్తున్నాం

**- మంత్రి రోజా**



సిమెంటు రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా

నగరి, డిసెంబరు 24 ప్రభాతవార్త:

ప్రజలు మచ్చే పాలన అందిస్తున్నామని జగనన్న పాలనలో ప్రజలకు మౌలిక సదుపాయాలు అన్ని సమకూరుతోందని మంత్రి రోజా అన్నారు. ఆదివారం నగరి మున్సిపల్ పరిధిలోని 6,16,26,27 వార్డుల్లో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే సిమెంటు రోడ్డు, డ్రైనేజీ పనులకు ఆమె భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రత్యక్షంగా గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఇదే నిజమైన అభివృద్ధి అన్నారు. గత పాలనలో టీడీపీ నాయకులు వారి లబ్ధి కొరకు, కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి పనులు చేపట్టారని దీంతో ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ప్రస్తుతం ప్రతి ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పర్యటించి ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. మీ ఆశీస్సులతో 2024లో హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు ఇంద్రయ్య, బీడీ భాస్కర్, దయానిధి, అమర్, సాయి సంధ్యారాణి, గంగాధరం, మురుగ, బిలాల్, మోహన్‌రాజ్, నాయకులు ఆనందకుమార్, శశికుమార్, ఇళంగోవన్, రాజముత్తు, శశికళ, తెన్‌మొళి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ శుభాలు కలగాలి



తిరుమల, డిసెంబర్ 24(ప్రభాతవార్త)ప్రతినిధి:

ధనుర్మాసంలో వైకుంఠ ద్వాదశి ఘడియలు ఆదివారం రోజు పెద్దసంఖ్యలో విఐపిలు వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. రెండవరోజు ద్వాదశిన తిరుపతి జిల్లా కలెక్టర్ కె. వెంకట రమణారెడ్డి, జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తెలంగాణా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తదితరులు శ్రీవారిని దర్శించుకుని వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు.



### వి.కోట ప్రభుత్వాస్పత్రిలో

# కాంటాక్ట్ వైద్యుడి దురుసుతనం

**- కంటి మందు అడిగితే విలేకరిపై చిందులు !!**

వి.కోట, డిసెంబర్ 24 ప్రభాతవార్త



ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అందించాలని ఓ వైపు ప్రభుత్వం పేర్కొంటుంటే క్షేత్రస్థాయిలో కొంతమంది వైద్యులు దాన్ని తుంగలో తొక్కుతున్నారు. కంటి మందు అడిగిన ఓ స్థానిక విలేకరిపై వైద్యుడు చిందులేసి దురుసుగా ప్రవర్తించిన సంఘటన ఆదివారం జరిగింది. వి.కోటకు చెందిన ఓ విలేకరి కంటి సమస్య ఉందని వి.కోట ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కంటి మందు అడిగాడు. దీంతో కాంటాక్ట్ వైద్యుడైన శంకర్ నారాయణ కంటి మందు అందుబాటులో ఉన్నా లేదని చెబుతూ నీకు దిక్కున్న చోటు చెప్పుకో నేను చూసుకుంటా అంటూ దురుసుగా వ్యవహరించాడు. విధుల్లో ఉన్న సిబ్బంది సైతం నిర్లక్ష్యం చూపడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి వైద్యులపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# శ్రీకల్యాణ వెంకన్న వైకుంఠ ద్వాదశికి భారీగా తరలివచ్చిన భక్తులు

తిరుపతిరూరల్, డిసెంబర్24 ప్రభాతవార్త:



వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని పెద్దఎత్తున భక్తులు తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి దర్శించుకున్నారు. ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడ చెర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు నిరంతరరాయంగా తీర్థ ప్రసాదాలు పంఫిణి చేసారు. వైద్య సదుపాయాలను కూడా అందుబాటులో ఉంచారు. పోలీసులు కూడా వాహన ఫార్కింగ్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తులు విశేష సంఖ్యలో ద్వాదశి వేడుకలలో పాల్గొన్నారు.

**శాస్త్రోక్తంగా చక్రస్నానం**

వైకుంఠ ద్వాదశి పర్వదినాన తుమ్మలగంట ఆలయం ఎదుట ఉన్న కోనేరులో శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. అంతకుముందు అర్చకులు వేడుకగా తిరుమంజనం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన భక్తులకు దర్శనభాగ్యం కల్పించిన క్రమంలో సకల దోష నివృత్తికై చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించడం అనవాయితీగా వస్తోందని ఆలయ ప్రధాన అర్చకులు అనంతాచార్యులు పేర్కొన్నారు.

# పుంగనూరు అభివృద్ధిని చరిత్రలో నిలబెడతా

**మంత్రి పెద్దిరెడ్డి**

చౌడేపల్లి, డిసెంబర్ 24 ప్రభాతవార్త

గత 40యేళ్ళుగా పుంగనూరు నియోజకవర్గ ప్రజలు చూడని అభివృద్ధిని చేసి చరిత్రలో నిలబెడతానని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల వ్యాప్తంగా రూ. 13కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అంకితం చేసారు. వైకాపా ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నియోజకవర్గంలో 30యేళ్ళ అభివృద్ధి 4యేళ్ళల్లో చేసి చూపించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి పుంగనూరుపై ప్రత్యేక అభిమానముందనీ, అడిగిన వెంటనే మంజూరు చేస్తున్నారన్నారు. ప్రతి మండలంలో నాణ్యమైన విద్యుత్ అందించాలనే వుద్ధేశ్యంతో సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రజలకు ఆరోగ్యవంతమైన నీరందించేందుకు ఆర్ఓఆర్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఇంటింటికీ కొళాయిలు అమర్చాలన్న తలంపుతో పనులు ప్రారంభించామన్నారు. ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తు చేసారు. తన ప్రతి పర్యటనలోనూ రూ. 10కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. పేదరికమే కొలబద్ధగా కుల, మతాలకు అతీతంగా పారదర్శక పాలనను వైకాపా ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పనవి, చెప్పనవి నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. పెద్దకొండామర్రి, బిల్లేరు, దుర్గసముద్రం గ్రామాల్లో ఒక్కొక్కటికి రూ. 3.20కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్లు, అదే విధంగా ఒక్కొక్కటి రూ. 5లక్షలతో ఏర్పాటు చేసిన 10ఆర్ఓఆర్ మంచినీటి కేంద్రాలు, రూ. 23.94లక్షలతో నిర్మితమైన 4ఆర్‌బికే సెంటర్లు, రూ. 20.80లక్షతో నిర్మించిన 4వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, రూ. 16లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ కేంద్రాల భవనాలు, రూ. 17.50లక్షతో బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్, రూ. 43.80లక్షతో నిర్మితమైన సచివాలయ భవనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీడిసిఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, డిపిఓ లక్ష్మీ, జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, వైకాపా మండలాధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు, బికెజి ఛేర్మన్ నాగరాజరెడ్డి, సభ్యుడు పవన్‌రాయల్, యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, రాష్ట్ర వైకాపా వాణిజ్య విభాగ సహాయ కార్యదర్శి గ్రెంధెం మంజునాథ్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, విజయవాణి సంస్థల అధినేత నాయుని సుధాకర్ మూర్తి, మండల సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ, బికెజి మాజీ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, సింగిల్‌విండో అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, హెచ్‌డిఎస్ ఛేర్మన్ కె.కళ్యాణ్‌భరత్, ఎంపిటీసీలు తొండా శ్రీరాములు, రూపారేఖ, కరణంవారిపల్లి గిరి, హరీష్‌రాయల్, శ్రీరామ్‌భరత్‌వరుణ్, తహశీల్దార్ మాధవ రాజు, ఎంపిడిఓ సుధాకర్, ఎంఇఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, మండలంలోని సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, పెద్దిరెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాజూరు బాలాజీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

**చిత్తూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త:**



జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ నాయకత్వంలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం క్రికెట్ పోటీలు ప్రారంభం అయ్యాయి. మొర్ధానపల్లికి సమీపంలోని అమర్‌రాజా ఫ్యాక్టరీస్ ఆవరణలో వున్న క్రీడా మైదానంలో ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే బిఎన్.రాజసింహులు, పారిశ్రామికవేత్త డికె బద్రినారాయణ, దివంగత మాజీ టిటిడి ఛైర్మన్ డికె ఆదికేశవులు తనయుడు డిఎ శ్రీనివాసులు, జిల్లా దేశం నాయకులు చంద్రప్రకాష్‌లు క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి సందీప్, మాజీ కార్పొరేటర్ వసంత్‌కుమార్, గుడిపాల మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మాజీ ఎంపిపి జయచంద్రనాయుడు, చిత్తూరు రూరల్ 'దేశం' అధ్యక్షుడు శశికర్‌బాబు, పారిశ్రామికవేత్త గురుజాల జగన్, గుడిపాల 'దేశం' ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా 'దేశం' కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, రాష్ట్ర తెలుగు మహిళ ఆర్గనైజింగ్ సెక్రటరీ సిఎం విజయ, నాయకులు త్యాగరాజన్, నౌషాద్, కిషోర్, సతీష్, వరలక్ష్మీ, నాగలక్ష్మీ, నిత్య, మేషక్, పూల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పొద్దుటూరులో గణిత అష్టవధానం



**బంగారుపాళ్యం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** వైఎస్‌ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు నందు మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం గణిత అష్టవధానం నిర్వహించారు. కడప జిల్లా ఆంధ్రప్రదేశ్ మాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈ అష్టావధాన కార్యక్రమం జరిగింది. పాఠశాలకు చెందిన విద్యార్థులు లహరి, పునీత్ సాయి, హేమ, రేవతిలు గణిత అష్టావధానం చేపట్టారు. ఈ అష్టవధానంకు చిత్తూరు జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు అరుణ శివప్రసాద్ సంధాన కర్తగా వ్యవహరించారు. విద్యార్థులచే నిర్వహించిన గణిత అష్టవధానం పలువురిని ఆశ్చరముక్తులను చేసింది.

## డాక్టర్ థామస్‌ను సన్మానించిన భీమినేని చిట్టిబాబు



**పాలసముద్రం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జి డాక్టర్ థామస్ దంపతులను రాష్ట్ర ప్రభావశీల గుర్తింపు కమిటీ సభ్యుడు భీమినేని చిట్టిబాబు, ఆయన భార్య రేవతిలు సన్మానించారు. డాక్టర్ థామస్ వివాహ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం డాక్టర్ థామస్ దంపతులు పాలసముద్రంలోని భీమినేని చిట్టిబాబు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ థామస్ దంపతులను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల దేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నియోజకవర్గ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శబరివాసన్, సీనియర్ నాయుడు రవినాయుడు, విజయ్‌కుమార్, వాసునాయుడు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఐఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ

**కుప్పం, డిసెంబర్ 24 ప్రభాతవార్త**



తిరుపతి ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఐఆర్‌ఎం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. బికామ్‌లో మనీషా 9.17పాయింట్లు, కావ్యశ్రీ9.15పాయింట్లతో కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. అలాగే బిబిఎలో సౌమ్యశ్రీ 9.21, ఉమ్మేకుల్సుం 8.94పాయింట్లు సాధించారన్నారు. బిఎస్సీలో హేమలత 9.16, ఫాతిమా 9.07, మేఘన 8.63,బిందు 8.52పాయింట్లు సాధించారన్నారు. ఈసందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ఛైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డా॥ మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## రామకుప్పం వైకాపా యూత్ అధ్యక్షుడిగా యశ్వంత్‌రెడ్డి

**కుప్పం(రామకుప్పం), డిసెంబర్ 24 ప్రభాతవార్త**



రామకుప్పం మండల వైకాపా యూత్ విభాగం అధ్యక్షుడిగా కెజె యశ్వంత్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించారని, మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోసం శక్తివంచన లేకుండా పనిచేసా_మన్నారు. తనకు పదవి అప్పగించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం,జడ్పీటిసి నితిన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## దీర్ఘకాలిక మొండి వ్యాధులు ఆయుర్వేద వైద్యంతో నయం

– ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల చాళక్యవిభాగాధిపతి డా.పి.జగదీష్‌కుమార్‌రెడ్డి



**చిత్తూరురూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** అల్లోపతి, హోమియోపతి వైద్యంలో నయంకాని దీర్ఘకా లిక మొండివ్యాధులు ఆయుర్వేద వైద్యంతో పూర్తిగా నయమవుతాయని తిరుపతి ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల చాళక్య విభాగాధిపతి డా.పి.జగదీష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్‌కాలనీ ఎదురుగా వున్నశ్రీవారి ఆయుర్వేదిక్ స్పెషాలిటీ ఆయుర్వేద నిలయంలో ముంబై రాజస్థాన్ ఔషధాలయ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరంను ఏర్పాటుచేసారు. ఈ శిబిరంలో డా.పిజగదీష్‌కుమార్‌రెడ్డితో పాటు చిన్న పిల్లల వైద్యనిపుణులు డా.జమునలు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆయుర్వేదిక్ స్పెషాలిటీ నిర్వాహకులు ధనంజయరెడ్డి, ముంబై రాజస్థాన్‌ఔషధాలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## జిజెఎం ట్రస్ట్ తరపున పాస్టర్లకు క్రిస్మస్ కానుకలు

**చిత్తూరురూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:**



చిత్తూరు నగరం లక్ష్మీనగర్‌కాలనీ లోని బిపి కాంపౌండ్ చర్చినందు ఆదివారం జిజెఎం ట్రస్ట్ ఛైర్మెన్ గురజాల జగన్మోహన్ పాస్టర్లకు క్రిస్మస్ కానుకలను అందజేసారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలనే ఆకాంక్షతో జిజెఎం ట్రస్ట్ తరపున జగన్మోహన్ క్రిస్మస్ కానుకలను అందజేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు. అలాగే రాబోవు ఎన్నికల్లో క్రైస్తవులు తెలుగుదేశం పార్టీని బలపరచి చంద్రబాబునాయుడును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర బిసి సెల్‌అధికార ప్రతినిధి వెంకటేష్‌యాదవ్, కార్పొరేటర్ అశోక్, వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు

– సర్పంచ్ భానుప్రియ

**పాలసముద్రం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** కృష్ణజిమ్మాపురం పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడాలని సర్పంచ్ భానుప్రియ అధికారులను కోరారు. పంచాయతీ పరిధిలోని కొల్లిరెడ్డికండ్రిగ గ్రామంలో మంచినీటి బోరు మరమ్మత్తులకు గురి కావడంతో ఆదివారం సర్పంచ్ భానుప్రియ తన సొంత నిధులతో రిపేర్ చేయించారు. పంచాయతీ పరిధిలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి సర్పంచ్ భానుప్రియ కృషి చేస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిధులు అవసరంవుందని, అయితే పంచాయతీకి సరైన నిధులు లేకఎపోవడంతో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించినిధులుమంజూరు చేస్తే పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ భానుప్రియ పేర్కొన్నారు.

## ప్రతి ఇంటికి సంక్రాంతి కానుక

– జిడినెల్లూరు 'దేశం' ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్

**ఎస్‌ఆర్ పురం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:**

గత ప్రభుత్వ హయాంలో సిఎం చంద్రబాబునాయుడు ప్రతి ఇంటికి సంక్రాంతి కానుకలు అందించేవారని, ఇదే తరహాలో ప్రతి ఇంటికి త్వరలో సంక్రాంతి కానుక అందిస్తామని జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్ పేర్కొన్నారు. డాక్టర్ థామస్ వివాహ దినోత్సవం పురస్కరించుకొని పుల్లూరు క్రాస్ రోడ్డులో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని డాక్టర్ థామస్ దంపతులకు స్వాగతం పలికిఆశీర్వదించారు.డాక్టర్ థామస్ మాట్లాడుతూ సంక్రాంతి పురస్కరించుకొని నియోజకవర్గం పరిధిలోని ప్రతి కుటుంబానికి చీర, జాకెట్, పంచ, షర్ట్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీమాజీ ఛైర్‌పర్సన్ గీర్వాణీ చంద్రప్రకాష్, తెలుగుదేశం ప్రభావశీల గుర్తింపు కమిటీ సభ్యుడు భీమినేని చిట్టిబాబునాయుడు, గంధమనేని జయశంకర్‌నాయుడు, భాస్కర్‌నా యుడు, దాము, గుండయ్య, రాజశేఖర్‌నాయుడు, రాజేంద్రనాయుడు, గొల్లపల్లి సుబ్రమణ్యం నాయుడు, బాలాజీ నాయుడు, మురళీమోహన్, మురళీ, మునిచంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 2024 ఎన్నికల బరిలో వుంటా

– డిఎ శ్రీనివాస్ స్పష్టీకరణ

**చిత్తూరుటౌన్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** 2024 ఎన్నికల బరిలో తాను వుంటానని మాజీ టిటిడి ఛైర్మన్ దివంగత డికె ఆదికేశవులు తనయుడు డిఎ శ్రీనివాస్ స్పష్టం చేశారు. చిత్తూరులోని ఆయన నివాసంలో ఆదివారం డిఎ శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు, ఇతర పెద్దలను చర్చించి తన రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. ఏ పార్టీ తరపున పోటీ చేస్తాననే విషయం సైతం తన శ్రేయోభిలాషులతో చర్చలు జరిపిన అనంతరం ప్రకటిస్తానని స్పష్టం చేశారు. గతంలో శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీటి సరఫరా చేసిన విషయంను ఆయన గుర్తు చేశారు. తన రాజకీయ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తానని ఆయన పేర్కొన్నారు. తన తండ్రి మాజీ టిటిడి ఛైర్మన్, మాజీ ఎంపి డికె ఆదికేశవులు, తన తల్లి మాజీ ఎమ్మెల్యే డిఎ సత్యప్రభలు చేసిన సేవలు తన కుటుంబానికి చిత్తూరులో మంచి గుర్తింపు తెచ్చిందన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## హైందవ ధర్మ పరిరక్షకే వీరశైవులు పాదయాత్ర

**చౌడేపల్లి, డిసెంబర్ 24 ప్రభాతవార్త**

హైందవ ధర్మ పరిరక్షణకై వీరశైవ లింగాయత్, జంగమల ఆధ్వర్యంలో పాదయాత్రను చేపడుతున్నామని ఆసంఘ నాయకులన్నారు. పలమనేరు పత్తికొండ నుంచి అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాజచోటి వీరభద్రస్వామి ఆలయానికి చేపట్టిన పాదయాత్రలో భాగంగా యాత్రా బృందం చౌడేపల్లికి చేరుకొన్నారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలు కనమరుగవుతున్న ప్రస్తుత సమయంలో వారిని జాగురూకులుగా చేయడానికి ఇలాంటి పాదయాత్రలు ఉపయుక్తంగా వుంటాయన్నారు. వీరశైవ లింగాయత్ జిల్లా కార్యదర్శి ఠాణేదార్ నాగరాజ, నాయకులు సదాశివ, మంజునాథ్, ఆటో మంజు, ఠాణేదార్ బసవరాజ, బద్రినాథ్, లక్కూరి నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

## టి.పుత్తూరులో అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

**తవణంపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త:**



అయోధ్య ఆలయ కుంభాభిషేకం సందర్భాన్ని పురస్కరించుకుని మండలానికి చేరుకున్న శ్రీరామజన్మభూమి క్షేత్ర తీర్థం నుండి వచ్చిన శ్రీరామచంద్రమూర్తి ఆశీర్వదించిన అక్షింతలను మండలంలోని టి.పుత్తూరు శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో ఆదివారం మండలంలోని గ్రామ పంచాయతీలకు పంపిణీ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. గత 20 రోజుల క్రితం అయోధ్య రాముని అక్షింతలు మండలానికి చేరుకోగా వీటీని ప్రముఖ ఆలయాల్లో వుంచి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండలంలోని గ్రామపంచాయతీల నుండి వచ్చిన ప్రతినిధులకు ఒక్కో పంచాయతీకి ఐదు కిలోల వంతున అక్షింతలను పంపిణీ చేశారు.వీటిని ఆయా గ్రామాలలోని ఆలయాలలో వుంచి జనవరి 1 నుండి 14 వరకు ప్రతి ఇంటికి పంపిణీ చేయనున్నారు. జనవరి 22న రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఈఅక్షింతలను చల్లుకుని స్వామివారి ఆశీస్సులు పొందాలని కమిటీ కన్వీనర్ చంద్రబాబు తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపీ జిల్లా ఉపాధ్యక్షుడు కెవి.చంద్రమోహన్, దేవస్థానం ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి,అనంత పద్మనాభం, శంకర్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, జానకిరాం, హరిప్రసాద్, మోహన్‌లతో పాటు పలు గ్రామాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## సిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

**కాణిపాకం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈ మేరకు హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన కరుణాకరన్ అనే భక్తుడు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ,ప్రసాదాలను అందజేశారు.దాత కుటుంబస భ్యులు ఐరాల తహసీల్దార్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

## గణనాధునికి ఘనంగా నృత్య నీరాజనం

**కాణిపాకం డిసెంబర్ 24 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఆస్థాన మండపంలో కళాకారులచే నృత్య నీరాజనం కార్యక్రమంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రాచీన కళలు సంప్రదాయాలను ప్రోత్సహించడానికి వీలుగా దేవాదాయ ధర్మాదాయశాఖ ఆదేశాల మేరకు కాణిపాకం ఆలయంలో గత కొంత కాలంగా ధర్మపథం కార్యక్రమంను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాణిపాకం దేవస్థానం, తిరుపతి ప్రజాప్రతి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నృత్యనీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది కళాకారులచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు కళాకారులకు జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు.

## జాబ్‌మేళాలో 42మంది ఉద్యోగాలకు ఎంపిక

**కుప్పంరూరల్, డిసెంబర్ 24 ప్రభాతవార్త**



సాయిమాతా సేవా ట్రస్ట్, కోలారు మ్యాన్‌పవర్ సంస్థ అధ్వర్యంలో ఆదివారం కుప్పంలో జరిగిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. సుమారు 150మంది హాజరు కాగా వీరిలో 42మంది ఉద్యోగాలకు ఎంపికచేసి నియామకపత్రాలు అందించారు.వాచ్‌ఆర్‌లు ఝాన్సీ, సురేష్, ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కొవిడ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెడికల్ ఫీసర్ డాక్టర్ రూప

**కోట,డిసెంబర్ 24 ప్రభాతవార్త**

కొవిడ్ ..19 తో అనేక దేశాలు గజ గజ వణికిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల కేరళ రాష్ట్రంలో కొవిడ్ 19 సబ్ వేరియంట్ జేఎన్..1 వెలుగు చూసింది. ఇప్పటికి కేంద్రం అప్రమత్తమై అన్నీ రాష్ట్రాల్లోని ఆరోగ్యశాఖలతో పాటు ఆసుపత్రులను అప్రమత్తం చేసింది. దేశ వ్యాప్తంగా అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించింది. ఆకస్మాత్తుగా కేసులు పెరిగినా వైద్య బృందం అందుబాటులో ఉండి.. తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జాతీయ ఆరోగ్య శాఖ హెచ్చరించింది. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కోట ప్రభుత్వ ఆసుపత్రిలో కొవిడ్ నిమిత్తం ఒక వార్డు ఏర్పాటు చేసి అందులో అయిదు బెడ్లు సమకూర్చామని మండల మెడికల్ ఆఫీసర్, డాక్టర్ రూప చెప్పారు. గొంతునొప్పి, దగ్గు,జ్వరం కండరాలు నొప్పి ఉంటుయన్నారు. ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు.ప్రజలు ఏంతో అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.

## నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సేవలు అపారం

**కోట, డిసెంబర్ 24 ప్రభాతవార్త**

జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, దివంగత నేత నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరు జిల్లా ప్రజలకు అందించిన సేవలు అపారమని ప్రజాప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు పేర్కొన్నారు. ఆదివారం చంద్రశేఖర్‌రెడ్డి 97వ జయంతి సందర్భంగా కోటలోని నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి నివాసంలో పలువురు ప్రముఖులు, వ్యాపారులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పాఠశాలలు, రోడ్లు, తుపాను షెల్టర్లను, మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా చంద్రశేఖర్‌రెడ్డి నిలిచిపోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రటరీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, తిమ్మానాయుడుపాలెం మాజీ సర్పంచ్ ఆనందమూర్తి, కోట ఎంపిటిసి మొబిన్‌బాషా, చలపతి, యస్దాని, సర్పంచ్ వెంకటరమణమ్మ, నల్లపరెడ్డి వర్గీయులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఓజిలి మండల యూత్ అధ్యక్షుడిగా బట్టా పృధ్వీకృష్ణ యాదవ్

**ఓజిలి, డిసెంబర్ 24 ప్రభాతవార్త**



ఓజిలి మండల యూత్ అధ్యక్షుడిగా తనను నియమించడం ఎంతో సంతోషంగా ఉందని, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తనపై ఎంతో నమ్మకంతో రెండోసారి నియమించారని బట్టా పృధ్వీకృష్ణ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యే సంజీవయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు

**ఓజిలి, డిసెంబర్ 24 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట నియోజకవర్గంలో నూతనంగా ఎంపికైన వైసీపీ యువజన విభాగం ఓజిలి మండల అధ్యక్షులు బట్టా పృధ్వీకృష్ణయాదవ్, బట్టా అనిల్ కుమార్ యాదవ్ సూళ్లూరుపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలియజేశారు. ఈసందర్భంగావీరిని ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందించారు. వారి వెంట పలువురు ఉన్నారు.

## 26 నుండి ఉపాధి హామీ పథకం సిబ్బందికి శిక్షణ

**బాలాయపల్లి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మండలంలోని 24 గ్రామ పంచాయితీలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం సిబ్బందికి 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఓ ప్రమీల రాణి తెలిపారు. ఉపాధి హామీ పథకం కూలీలను సమయానికి పనికి తీసుకురావడం వారికి ఇచ్చే కూలి డబ్బులు పెంచే విధంగా చేయడం అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మూడు విడుతలగా శిక్షణ ఇస్తున్నామని అందరూ తప్పకుండా శిక్షణకు హాజరు కావాలని కోరారు.

## పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**గూడూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త**



ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు పొణకా మల్లికార్జునరెడ్డి సంపూర్ణ సహకారంతో గూడూరులోని జానకిరామ్‌పేటలో క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో నిరుపేదలైన 15 క్రిస్టియన్ కుటుంబాలకు 18 రకాల ఫలసరుకులు, దుప్పట్లను శ్రేయ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అగస్టస్ చేతుల మీదుగా ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బాబు అగస్టస్ మాట్లాడుతూ ప్రగతి సేవాసంస్థ చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను అభినందించారు. సంస్థ అభివృద్ధి కోసం ఆయన వంతు సహాయంగా రెండు లక్షల రూపాయలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బడి ధనంజయరెడ్డి, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, శ్రేయ రియల్ ఎస్టేట్స్ ప్రతినిధి జోనా, మురళీ సింగ్, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్‌రావు, గ్రానైట్ ప్రభాకర్, ఐటిఐ ప్రభాకర్, దయాకర్, ప్రభాకర్, కెఆర్‌ఎం మల్లికార్జున, వాచ్‌షాప్ రాము, కుమార్‌నాయుడు, శివకుమార్‌రెడ్డి, కోట వెంకటేశ్వర్లు, రాజు, పెంచలయ్య, తనూజ్, కృష్ణరెడ్డి, నాగరాజు, ప్రసాద్, విజయ్, నాగేంద్ర, సివిఆర్ న్యూస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**గూడూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త**




సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా ప్రజలకు ఆ పార్టీ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1925 డిసెంబర్ 26న లక్నోలో సిపిఐ ఆవిర్భవించిందని అన్నారు. అప్పటి నుంచి పేద ప్రజల పక్షాన ఉంటూ అలుపెరుగని పోరాటాలు చేసిందన్నారు. గూడూరు పట్టణంలో మంగళవారం నిర్వహించే ఆవిర్భావ దినోత్సవంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సివిఆర్ కుమార్, ఎఐటియుసి నాయకులు ఎంబేటి చంద్రయ్య, కె.నారాయణ, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన రొటేరియన్లు

**సూళ్లూరుపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త**




సూళ్లూరుపేటలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సర్వీస్ ప్రాజెక్టులో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రొటేరియన్లు మొక్కలు నాటే కార్యక్రమానికి ఆదివారం శ్రీకారంచుట్టారు. గీతిక అనే విద్యార్థిని నిర్వహిస్తున్న యాడమురి ఇంటిగ్రేటెడ్ రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అనే స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు దశరధరెడ్డి, కార్యదర్శి ఎం.వినయ్‌కుమార్, ఎ.సుధాకర్‌రావు, తన్నీరు శేషగిరిరావు, డాక్టర్ ధనుంజయ్, శివకుమార్, శ్రీరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ ఛైర్మన్

**సూళ్లూరుపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆదివారం కడప జిల్లా ఇడుపులపాయకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యులతో ఆయన ప్రతి ఏటా ఇడుపులపాయకు వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డికి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద నివాళి అర్పిస్తుంటారు. ప్రస్తుతం అదే రీతిలో ఆయన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## చంద్రబాబును కించపరిచే ఫ్లెక్సీలను తొలగించాలి

తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు

**వెంకటగిరి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై కించపరిచే విధంగా వైసిపి వారు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం దారుణమని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు తెలిపారు. అసభ్యకర ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని టిడిపి, జనసేన నాయకులు సిఐ సంగమేశ్వర రావు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని పలుచోట్ల చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్ అలా కించపరిచే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలం పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, డక్కిలి పార్టీ అధ్యక్షుడు కోటేశ్వర్ రెడ్డి, నాయకులు నరసింహులు, మచ్చులు వేణు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 12వ రోజుకు చేరిన అంగన్‌వాడి సిబ్బంది దీక్షలు

**వెంకటగిరి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

డిమాండ్ల సాధనకు అంగన్‌వాడి సిబ్బంది చేస్తున్న సమ్మె 12వ రోజుకు చేరింది. సిడిపిఓ కార్యాలయం వద్ద ఆదివారం అయినా డిమాండ్ల సాధనకు అంగన్‌వాడి వర్కర్లు, ఆయాలు రిలే నిరాహార దీక్షలు చేశారు. అంగన్‌వాడి డిమాండ్ పరిష్కరించే వరకు పోరాటం ఆగని వడ్డేపల్లి చంగయ్య తెలిపారు. అంగన్‌వాడిడిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు ఢీకొని మహిళ మృతి

**గూడూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని 60 ఏళ్ళ మహిళ రైలు ఢీ కొని మృతి చెందింది. విజయవాడ నుండి చెన్నై వెళ్ళే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు గూడూరులో స్టాపింగ్ లేదు. ఈ క్రమంలో భాగంగా అదే రైలు కింద పడి ఆ మహిళ దుర్మరణం చెందింది. మహిళ పట్టాలు దాటుతుండగా ప్రమాదం సంభవించిందా.. లేక పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పాల్పడిందా అన్న వివరాలు తెలియరాలేదు. మహిళ మృతి చెందిన విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో పడ్డారు. మృతురాలు వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతోవారు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## చంద్రబాబు పర్యటన జయప్రదం చేయాలి

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

**శాంతిపురం/గుడుపల్లె డిసెంబర్ 24 ప్రభాతవార్త**

తెదేపా అధినేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్ కోరారు. ఆదివారం శాంతిపురం, గుడుపల్లె పార్టీ కార్యాలయాల్లో జరిగిన వారు మాట్లాడారు. శాంతిపురంలో ఈనెల 29వతేది జరిగే బహిరంగసభలో చంద్రబాబు పాల్గొంటారన్నారు. అధినేత చంద్రబాబు పర్యటనను నేతలు, కార్యకర్తలు విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, నేతలు విశ్వనాథనాయుడు, బాబునాయుడు, మునిరాజు, జయరాంరెడ్డి, రమేష్, మణి, శేఖర్, చంద్రకళ, నాగరాజు, హేమాంబరగౌడు, రూప,వనిత, వేదశ్రీ, సరిత పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ డా॥ కంచర్ల సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలకు శాంతిపురంలో మద్దతు పలికారు. త్వరలోనే సిఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపడతారని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

## కొలమడుగులో ఎన్టీఆర్ స్మారక క్రికెట్ టోర్నీ

**శాంతిపురం, డిసెంబర్ 24 ప్రభాతవార్త**



మండలంలోని కొలమడుగులో ఎన్టీఆర్ స్మారక క్రికెట్ టోర్నీని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని యువతను ప్రోత్సహిస్తా_మని పేర్కొన్నారు. కాగా ఈటోర్నీలో ముప్పై జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, విశ్వనాథనాయుడు, రమేష్, అనసూయ పాల్గొన్నారు

## నిద్రమాత్రలు మింగి ఆశ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

**కుప్పంరూరల్, డిసెంబర్ 24 ప్రభాతవార్త** గుడుపల్లె మండలం సోడిగానిపల్లికి చెందిన రత్నమ్మ (47) అనే ఆశ కార్యకర్త నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ప్రస్తుతం ఈమె కుప్పం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలిలా.. రత్నమ్మ 2007వ సం॥నుంచి సోడిగానిపల్లి పిహెచ్‌సి పరిధిలో ఆశ వర్కరుగా పనిచేస్తున్నట్లు పేర్కొంది. ఇదే పిహెచ్‌సిలో ఎంఎల్‌హెచ్‌గా పనిచేస్తున్న శశి, మరో ఆశ వర్కరు సరస్వతిలు తాను విధులకు హాజరైనా గైర్హాజరు అయినట్లు నమోదు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిపింది. వారిని ప్రశ్నిస్తే తనను కొట్టారని దీంతోని ద్రమాత్రలుమింగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడినట్లు పేర్కొంది. ప్రస్తుతం రత్నమ్మ

## కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పం౦ద్ర.జిఘ్నేష్ తిరుపతిలో నిర్వహించిన కరాటే తన పోటీల్లో తన ప్రతిభను చాటి మూడో స్థానంలో నిలచినట్లు కరస్పాండెంట్ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో విద్యార్థి రెండు పతకాలను సాధించినట్లు వివరించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ పాఠశాలలో ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడంతో పాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు. విద్యార్థి తాతయ్య ధనంజయులు పట్టణంలోని టౌన్‌బ్యాంకులో సిఈవోగా విధులు నిర్వహిస్తున్నారు.

## బిసిలకు చంద్రన్న భరోసా

-నాయిబ్రహ్మణ సాధికార సమితి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌రెడ్డి అరాచక పాలనలో తమ మాన ప్రాణాలను కోల్పోతున్న కోట్లాదిమంది బిసిలకు భరోసా ఇవ్వడానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కంకణబద్దులై ఉన్నారని తెదేపా నాయిబ్రహ్మణ అధ్యక్షుడు సాధికార సమితి నియోజకవర్గ కన్వీనర్ పైడిపూల నాగూరయ్య పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి వర్గాలలో చైతన్యం కలిగించడానికి తెలుగుదేశంపార్టీ చేపట్టిన బిసి భరోసా బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం నియోజకవర్గ నాయిబ్రాహ్మణ సాధికార సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని నాయిబ్రహ్మణ కుటుంబసభ్యులను కలసి జగన్‌రెడ్డి ప్రభుత్వంలో బిసిలకు జరుగుతున్న అన్యాయాలను తెలిజేసే కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో తెదేపా పార్టీ నెల్లూరు పార్లమెంటు కార్యదర్శి ఈదరశ్రీనివాసులు, నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోటచంద్రశేఖర్, కడివేటి వీరరాఘవులు, నియోజకవర్గ వర్గ కో కన్వీనర్ యాకశిరి కృష్ణమూర్తి, అన్నవరపు గోపి, ఆవులపాటి యుగంధర్, శంకర్, నరసింహులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల చట్టాలు,హక్కులపై అవగాహన సదస్సు

తిరుపతి డిసెంబరు24 ప్రబాతవార్త




జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరిం చుకుని ఆదివారం నగరంలోని స్థానిక ఎంఆర్‌పల్లి లోని జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రధాన కార్యాలయంలో పాఠశాల విద్యార్ధులకు, పుర ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతి ధిగా జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు అచ్యుత పార్ధసారధి పాల్గొని మాట్లాడారు. స్వతంత్రం రాకముందు నుండి దేశంలో వినియోగదారుల రక్షణ కోసం అనేక విధానాలు అములులో ఉన్నాయని, అయితే స్వతంత్రం సాధించుకున ్న తరువాత 1986లో ఈ చట్టాలకు మరింత బలం చేకూర్చి వినియోగదారులకు తక్షణం న్యాయం జరిగేవిధంగా చర్యలుతీసుకోవటం జరిగిందన్నారు. వినియోగదారులు వారి హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కామర్స్, షోరూ మ్స్ కొనుగోలు, తదితరవాటిలో కొనుగోలు చేసిన వస్తువుల్లో లోపాలు ఉంటే తక్షనం వినియోగదారుల కమిషన్‌కు ఫిరా ్యధు చేయవచ్చని, తమకు ఫిర్యాధు అందిన 48 గంటలలోపు ఆయా సంస్థలు ఫిర్యాదును స్వీకరించి టికెట్ మంజూరు చేయ్యాలని, టిక్కెట్(ఫిర్యాదు) అందిన 30 రోజుల్లో ఆయా సమస్యలను పరిష్కరించి వినియెగదారులకు లబ్ధి చేకూర్చాలన్నారు. కమిషన్ సభ్యులు ఎన్.శశిధర్‌రెడ్డి, టి.స్నేహలతలు మాట్లాడుతు రిజయల్ ఎస్టేట్, మెడికల్ క్లయిమ్స్, వస్తువుల కొగులోలు, వాటి వలన కలిగిన నష్టాలు, వాటిపై వినియోగదారులు జరిపిన పోరాటాలు, పొందిన విజయాలు, నేషనల్ కంపెనీలకు సైతం వేసిన జరిమానాలు తదితర అంశాలు వివరించి విద్యార్ధులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు అనుగ్రహ సైమన్,సాయి చరణ్, అనుదీప్,సాయి ధీక్షితలు మాట్లాడుతు వినియగదారుల కమిషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర్, అమర్‌నాద్, అధ్యాపకులు గురుమూర్తి, తిరుపాలు, సబ్బరామయ్య,లతోపాటూ మంగలం విద్యాలయ, శ్రీ విద్యానికేతన్, భారతీయ విద్యాభవన్, పిఈఎస్ పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు ,వారి ఉపాధ్యాయులు పెద్ద స ఒఖ్యలో పాల్గొన్నారు.

## డయల్ యువర్ కమిషనర్, స్పందన రద్దు : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 24, ప్రభాతవార్త



డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ఈ నెల 25వ తేది సోమవారం క్రిస్మస్ ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా రద్దు చేయడం జరిగిందని తరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదివారం తెలిపారు.

## నిరుపేదలకు సేవలందించడం మహాద్భాగ్యం..ఎంఎల్‌సి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



నిరుపేదలకు సేవలందించడం మహాద్భాగ్యం అని ఎంఎల్‌సి, రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయిసుబ్ర మణ్యం అన్నారు. గత 12సంవత్సరాలుగా ప్రత్యేక ప్రతిభావంతులకు, నిరుపేదలకు సేవలందిస్తున్న హెల్పింగ్‌హ్యాండ్స్ సేవా క్యాక్రమాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి సంస్థ అధినేత మునీర్ బాషా అధ్యక్షత వహించి ఎంఎల్‌సికి ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం మాట్లాడుతూ 12సంవత్సరాలుగా తాము సంపాదించిన దానిలో కొంత ప్రత్యేక ప్రతిభావంతులకు, నిరుపేదలకు సేవలందిస్తున్న సంస్థ అధ్యక్షుడు మునీర్‌బాషాను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు న్యాయవాదులు గరికపాటి రమేష్‌బాబు, రాజేశ్వరరావు, కంటా ఉదయ్‌కుమార్, సంస్థ సభ్యులు బాబాఫరీద్, డిల్లీకుమార్, మునికృష్ణ, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మున్నాళ్ళ ముచ్చట

– మూలన పడిన వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం

గుడిపాల, డిసెంబర్ 24 ప్రభాతవార్త:



క్షేత్ర స్థాయిలో ఉచిత పశువైద్యం మున్నాళ్ళ ముచ్చటగా మారింది. గుడిపాల మండలంలో వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనం మూలన పడింది. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పశువులకు సైతం క్షేత్ర స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రతి మండలానికి ఒక వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనంను కేటాయించారు. ప్రారంభంలో ఈ సంచార పశు ఆరోగ్య సేవా వాహనం గ్రామాలకు వెళ్ళి పశువులకు వైద్యం అందించినా కొన్ని రోజులకు మూలన పడింది. ఈ సంచార వాహనంకు పశు వైద్యాధికారి లేకపోవడంతోనే వాహనం పశు వైద్యం కోసం పల్లెలకు వెళ్ళడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఒక మండానికి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి పశువులకు ఉచితంగా వైద్యం చేయడానికి సిద్ధం చేసిన సంచార పశు వైద్య సేవల వాహనంను పాడి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తే పశువులకు సకాలంలో వైద్యం అందే అవకాశం వుంటుంది.

# గాడితప్పుతున్న సత్యవేడు ఆర్టీసి డిపో

## - డ్రైవర్ల తీరుపై మండిపడుతున్న జనం

సత్యవేడు, డిశంబరు 24, ప్రభాతవార్త:



ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసి సత్యవేడు డిపో గాడితప్పుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే జనం డ్రైవర్ల తీరుపై మండిపడుతున్నారు. బస్‌స్టాపింగ్‌ల వద్ద బస్సులు ఆపకపోవడం, సమయపాలన సరిగా పాటించకపోవడం వంటి సమస్యలతో స్థానికులు ప్రయివేట్ బస్సులపై ఆధారపడాల్సి వస్తున్నది. ప్రధానంగా సత్యవేడు ఆర్టీసి డిపోలో 48 బస్సు సర్వీలు ప్రజా రవాణా సేవలను అందిస్తున్నాయి. ఇక్కడ దాదాపు 250కు పైగా వివిధ విభాగాల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇరవైశాతం మంది ఆర్టీసి ఉద్యోగులు ఏళ్ళతరబడి సత్యవేడులోనే మకాం పెట్టడం, కార్మికులకు అండగా నిలవాల్సిన యూనియన్‌లు పలువురికి స్వార్థమయంగా మారడంతో కొందరికి వరంగా మారింది. ఇష్టం వచ్చినప్పుడు విధులకు రావచ్చు, ఇష్టం వచ్చినప్పుడు సెలువులు పెట్టోచ్చు, ఇష్టమొచ్చిన సర్వీసును నడపవచ్చు అన్నచందాన వ్యవహరిస్తున్న వారి వ్యవహారశైలితోనే ఆర్టీసి గాడితప్పి ప్రగతిచక్రం తిరోగమనం చెందుతోందని ప్రయాణీకులు విమర్శిస్తున్నారు. ఈనేపధ్యంలో ఇక్కడ డిపో ఆదాయం కూడా ఆశించిన మేరకు రాబట్టడంలో, కొత్తసర్వీసులను పునరుద్ధరించడంలో మేనేజర్ విఫలమవుతున్న సమాచారం. ఇకనైనా ఆర్టీసి ఉన్నతాధికారులు చొరవ చూపి సత్యవేడు ఆర్టీసి డిపోను గాడిలో పెట్టాలని, ఏళ్ళతరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టి ప్రజా రవాణాను సరిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

## పిసిసి వ్యవహార ఇన్‌చార్జిగా ఠాకూర్ నియామకం పార్టీకి శుభసూచకం

– పిసిసి కార్యధర్శి కలికిరి నారాయణస్వామి



రూరల్, డిసెంబర్24 ప్రభాతవార్త:

మాణిక్యం ఠాకూర్ నియామకం ఆంధ్రలో కాంగ్రెస్ పార్టీ కి కార్యధర్శి కలికిరి నారాయణ స్వామి అన్నారు. ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని పటిష్టపరిచేందుకు అధిష్ఠానం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందని, మాణిక్యం ఠాకూర్‌ను పిసిసి ఇన్‌చార్జిగా నియమించడం హర్షదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరమోహన్, దిలీప్, నారాయణ, సాయి, స్వామి, శివకుమార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అపద్భాంధవు సి.యం. రిలీఫ్ పండ్

తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబర్24 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు ఆపదలో ఆపద్భాంధవుగా నిలుస్తుందని తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. తిరుపతిరూరల్ సప్తరికాలనీ గ్రామ పంచాయతీ అంబేద్కర్ కాలనీకి చెందిన చంద్రమమౌళికి రూ.1.20 లక్షల రుపాయాల సి.యం.రిలీఫ్ పండ్ చెక్కును ఆదివారం అందజేసారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని పొందిన బాధితుడు తుడ చైర్మెన్ కృతజ్ఞతలు తెలిపారు. సి.యం.రిలీఫ్ పండ్‌కు రావాడానికి సహకారం అందించిన ఉప సర్పంచ్ వసంత అశోక్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నేత లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్‌మస్ వేడుకలకు ముస్తాబైన చర్చ్‌లు

విజయపురం, డిసెంబరు 24 ప్రభాతవార్త :



క్రిస్‌మస్ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని చర్చ్‌లను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం మండలంలోని పలు చర్చ్‌లలో ప్రార్ధనలు నిర్వహించారు. పన్నూరులో సిఎస్‌ఐ చర్చ్, విజయపురం, ఎల్లసముద్రం ఎస్టీ కాలనీ, మాధవరం, ఆలపాకం, జి.ఎం.పురం, ఇల్లత్తూరు కెవిపురం, కళియంబాకం చర్చ్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని క్రైస్తవులు తమ ఇళ్ల ముందు స్టార్ లైట్‌లు ఏర్పాటు చేసుకున్నారు. వీధుల్లో క్రిస్‌మస్ తాత వచ్చారని సంబరాలు చేశారు.

## శివయ్య సేవలో శేషసాయి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని దర్శనానికి విఐపిలు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి ఎవిశేషసాయి కుటుంబసభ్యులతో వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఇఓ కె.యస్ రామారావు స్వాగతం చెప్పారు. ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజులు అభిషేకాల్లో పాల్గొన్నారు.స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం తరువాత గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి ఆలయ ఇఓ రామారావు స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు.వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు

## టిఎంవి కండ్రిగలో సిపాయి భరోసా

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం టిఎంవి కండ్రిగలో ఇటీవల మునెమ్మ అనే కుటుంబ యజమాని మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం భరోసా లో నిత్యావసర సరకులను అందించారు.శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లో ఆయన వన్నెకుల క్షత్రియులు నివాసముంటున్న గ్రామాల్లో ఎవరైనా కుటుంబయజమాని మృతి చెందితే వారిని పరామర్శించటం,ఆదుకోవటం జరుగుతుంది. మునెమ్మ కుటుంబాన్ని డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పరామర్శించారు.ఈ సందర్భంగా సిపాయి భరోసా లో 41 రకాల నిత్యావసర సరకులను అందించారు. తాను నిరుపేదలకు అండగా ఉంటానని వివరించారు.ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ కంఠాఉదయ్‌కుమార్‌గురువారెడ్డి,బత్తిరెడ్డి, సామిరెడ్డి భరత్‌రెడ్డి, మురళికృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్య నిర్మాణమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర

-రాష్ట్ర కార్యదర్శి కోలా

.శ్రీకాళహస్తిరూరల్/తొట్టంబేడు, డిసెంబర్ 24 ప్రభాతవార్త



గ్రామ స్వరాజ్యం నిర్మాణమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర అని అర్హులైన ప్రజలను లబ్దిదారులుగా మార్చడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఉద్దేశ్యం అని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ అన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు ఆదివారం శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలాల్లో గుంటకిందపల్లి, మద్దిలేడు, తాటిపర్తి, బసవయ్యపాళెం, ఏర్పేడు మండలంలోని రాజులపాళెం, పంగూరు మరియు మామందూరు పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను సంబందిత శాఖల అధికారులు మరియు లబ్దిదారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కోలా.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి సంకల్పం ప్రతి కుటుంబాల ఆర్ధిక పరిస్థితి అభివృద్ధికోసం, వారి ఆరోగ్య సంరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలకు సంబందించిన అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించిన సంకల్పమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర అని కోలా.ఆనంద్ కుమార్ లబ్దిదారులకు తెలిపారు. అనంతరం కేంద్ర ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ పథకాల లబ్దిదారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అసెంబ్లీ పార్టీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, కార్యక్రమ కన్వీనర్లు సెంజిగరం వెంకటరమణయ్య, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి చాగణం శైలజ, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మండలాల అధ్యక్షులు కూనాటి నాగరాజు, వేదాం కృష్ణయ్య, ధర్మారెడ్డి, బొబ్బిలిరెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఈగలబాలాజీ, సుబ్బరామిరెడ్డి, ఆర్కాడువంశీ, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, మునిరాజ, చొక్కానిరమేష్, కె.వాసు, నాగరాజు, ధర్మయ్యయాదవ్, రామిరెడ్డి, సుందరరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్నతోనే మహిళా సాధికారత సాధ్యం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



సమాజంలోని ప్రతి ఒక్కరు సమానమే అని లింగ వివక్షతలేని సమాజాన్ని స్థాపించడానికి విశేషంగా కృషిచేస్తున్న అతికొద్ది మంది రాజకీయ నాయకుల్లో ఒకరైన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయయుడు తోనే రాష్ట్రంలో మహిళా సాధికారిత సాధ్యమవు తుందని తెలుగుదేశంపార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమ ణ్యం(బుజ్జి) పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పురపాలక సంఘంలోని 52వ బూత్ పరిధిలోని కుటుంబాలను కలసి రాబోవు ఎన్నికల్లో తెదేపాను విజయం సాధించి అధికారం చేపట్టిన తర్వాత అమలు చేయబోయే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించి అర్హులకు సంబంధిత పథకాలతో వివరాలతో కూడిన పత్రాలను అందించినట్లు నెమళ్ళూరుబుజ్జి తెలిపారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, బూత్ కన్వీనర్ షేక్ జిలానీ, మైనార్టీ నాయకుడు రియాజ్, మొఘల్ అహ్మద్, జులేషా, మీర్జావలి, ఫైజూన్, అఫ్రోజ్, సబీనా, సూరి, ఆసియా, సబియా, గౌరిబాయి, శాంతాబాయి, కస్తూరిబాబు, అమ్మణ్ణమ్మ, మోతీబాయి, భవానీ బాయి తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో మహారాష్ట్ర సిఎం కుమారుడు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఆదివారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే కుమారుడు ఎంపి శ్రీకాంత్‌షిండే కుటుంబసమేతంగా దర్శించుకు న్నారు.ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకు న్నారు. శ్రీకాంత్ షిండే కుటుంబసమేతంగా రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో అధికారులు, స్థానిక శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డి స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు.వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. కాగా ఎంఎల్‌ఏ మధుసూధనరెడ్డి శ్రీకాళహస్తికి వన్నెతెచ్చిన ప్రఖ్యాతి గాంచిన కలంకారి కండువాతో సత్కరించారు.స్వామి వారి ప్రతిమను అందించారు.శ్రీకాంత్‌తో పాటు టిటిడి బోర్డు సభ్యుడు సౌరబ్‌బోరా ఉన్నారు.స్వాగతం చెప్పిన వారిలో ఆలయ ఇఓ కె.యస్ రామారావు,ఎంఎల్‌ఏ కుమారుడు బియ్యపు ఆకర్షరెడ్డిలు ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## కాలనీ కష్టాలకు శాశ్వత పరిష్కారం



ఇందిరమ్మ కాలనీలో పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, డిశంబర్ 24 ప్రభాతవార్త:

కాలనీలోని కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతామని టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఆదివారం ఆమె మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్ళి చంద్రబాబు ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాలను వివరించిన ఆమె చంద్రబాబు పాలనతోనే మన జీవితాలు బాగుపడతాయని అన్నారు. టిడిపి అధికారంలోకి ఖాయమనీ పేదల జీవితాలలో వెలుగులు నింపడంలో తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సింగు సుధ, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, గౌస్‌భాషా, లంకెళ్ళ లలిత, కొండూరు ప్రవీణ్ రాయల్, సక్కుర్ ధనంజయ రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, శ్రీదర్ నాయుడు, దొమ్మల పాటి సతీష్, మంగాపురం భాస్కర్, రాకేష్ చౌదరి, పాళ్యం మనోహర్, రాధమ్మ, సునీత, నాయుడమ్మ, మన్సూర్, సునీల్ నాయుడు, హరి, మండలం లోకేష్ రాయల్, ముత్తు, తంగవేలు, రవి, పాల్గొన్నారు.

## చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి విద్యార్థి విభాగం సన్మానం

చంద్రగిరి, డిశంబర్ 24 ప్రభాతవార్త:



అభిమాన నాయకుడు ఎంఎల్‌ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వైసిపి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు సూరి ఆధ్వర్యంలో పుష్పగుచ్చం అందజేసి దుశ్శాలువతో ఘన సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరేపల్లి రంగంపేట ఎంపిటిసి బోస్ చంద్రారెడ్డి, మొగరాల సురేష్, చెర్లోపల్లి పవన్, అవిలాల శివ, తదితరులు పాల్గన్నారు.

## అపూర్వం చిన్న నాటి జ్ఞాపకాలు

వడమాలపేట, డిసెంబరు 24 ప్రభాతవార్త:



వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1984-85 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకున్నారు. 38 ఏళ్ళ తరువాత కలసిన వారు ఆప్యాయంగా అందరి యోగ క్షేమాలను తెలుసుకుని, పాఠశాల రోజుల్లో సంతోష క్షణాలను నెమరు వేసుకున్నారు. గతంలో పాఠశాలకు డెస్కులు వితరణగా అందజేశామని భవిష్యత్‌లో కూడా పాఠశాలకు గుర్తుండేలా, విద్యార్థులకు సాయపడేలా కృషి చేస్తామని చెప్పారు. కలుసుకున్న వారిలో నాధముని, సత్యనారాయణ, రఘు, వెంకటముని,ప్రభాకర్,శ్రీధర్, మురళి, మునిగోపాల్, ముద్దుకృష్ణ, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం క్యాలెండర్ విష్కరణ

సత్యవేడు, డిశంబరు 24, ప్రభాతవార్త:



సత్యవేడు పట్టణంలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్ష్యుడు హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలండర్‌లను సంఘం నాయకులు ఆవిష్కరించారు. గ్రామాల్లోని ముదిరాజ్ కులస్తులందరికి క్యాలెండర్‌లను చేరవేస్తామని అధ్యక్ష్యుడు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటేశులు, పరంధామయ్య, గురుప్రసాద్,రాజశేఖర్, కోళ్ళచిన్న,గెడి మునిప్రతాప్, నాగరాజ్, హేమంత్‌లు పాల్గొన్నారు.

## షిరిడీ సాయిబాబా ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం

పుత్తూరురూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయం 3 గంటలకు మహాభిషేకం, 4.15 గంటలకు అభిషేక హారతి అనంతరం భక్తులకు వైకుంఠ ద్వార ప్రవేశం సర్వదర్శనం ప్రారంభించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయంలో ఈ నెల 25 తేదీ నుంచి 27 వరకు శ్రీ దత్త జయంతి మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు షిరిడీ సాయిబాబా నిత్య అన్నదాన సాంఘిక సేవా సమాజం వారు ఓ ప్రకటనలో తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పుత్తూరురూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జడ్పీ హైస్కూలులో 1985-86 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శ్రీనివాస బీఈడీ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను నేడు నెమర వేసుకుని ఒకే వేదికపై అందరు చేరారు. 36 సంవత్సరాల తరువాత ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమం నిర్వాహకులుగా బాలాజీరావు, మధు, చంద్రమౌళి, లక్ష్మి, రేవతి, మురళి, ఎబ్బూరు మోహన్ నిర్వహించారు.

## క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు

పుత్తూరురూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిల్లో ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఇందుకు చర్చలు ముస్తాబు చేశారు.

## ఆడుదాం ఆంధ్ర ప్రదర్శన

తిరుపతి (మహిళావర్సిటి), డిసెంబర్ 24, ప్రభాతవార్త



శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ తిరుపతి నుంచి టౌన్ క్లబ్ మీదుగా వెళ్లి తిరిగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వరకు ఆడుదాం ఆంధ్ర ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా ఒలంపిక్ స్టేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పిఎస్డిఏ సయ్యద్ సాహెబ్ ఆధ్వర్యంలో సాగింది. ఈ సందర్భంగా ఒలంబికా స్టేషన్ అధ్యక్షులు ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అద్భుతమైనదని ఈ కార్యక్రమం ద్వారా వార్డు స్థాయి నుంచి గ్రామస్థాయి, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు ఉచిత శిక్షణ, స్ఫూర్తిని నింపే ఈ కార్యక్రమంలో ఎంతో మంది క్రీడాకారులు ప్రతిభ బయటపడుతుందన్నారు. దీని ద్వారా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు బయటపడుతారని అన్నారు. శాప్ శిక్షకులు డిఎస్డిఎస్ సయ్యద్ సాహెబ్ మాట్లాడుతూ దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 1,50,000 మంది క్రీడాకారులు నమోదు చేసుకున్నారని వారందరికీ వార్డు, గ్రామ, మండల జిల్లా రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామని వారందరికీ క్రీడా దుస్తుల్ని పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ శిక్షకులు చక్రవర్తి, గోపి, వినోద్, లక్ష్మీకరణ, శశి, హింధూజా, నీలిమ, ప్రేమ్, వినోద్, డిఈవో శేఖర్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ విజయకుమారి, జెన్ స్పోర్ట్స్ అకాడమి కిరణ్ కుమార్, వివిధస్కూల్స్ కాలేజీపిడిలు,పిఈటిలుమున్సి పల్‌కార్పొరేటర్స్, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు క్రీస్‌మస్ వేడుకలకు ప్రార్ధన మందిరాలు ముస్తాబు

నారాయణవనం, డిసెంబర్ 24 ప్రభాతవార్త :



సోమవారం క్రీస్‌మస్ పండుగను జరుపుకోవడం కోస ం అన్నిగ్రామాల్లో వెలసిన క్రీస్తు మందిరాలను విద్యుత్‌దీపాలు, తోరణాలతో సర్వంగా సుందర ంగా అలంకరించారు. ఈనెల 1వతేది నుంచి క్రైస్తవ సోదరులు చర్చిలకు వెళ్లి భక్తి శ్రద్దలతో ఉపవాసదీక్షలు పాటించడంతో పాటు ప్రార్ధనలను చేస్తున్నారు. సోమవారం క్రీస్‌మస్ పండుగను జరుపుకోవడం కోసం ప్రార్ధన మందిరాలకు వెల్లకొట్టడంతో పాటు మందిరాలను విద్యుత్‌దీపాలు, తోరణాలతో అలంకరిస్తున్నారు. క్రైస్తవసోదరులు తమ తమ ఇళ్లపై స్టార్ గుర్తును ఏర్పాటు చేసారు. క్రైస్తవసోదరులు ఇప్పటికే అనేకచోట్ల వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. పేదలను ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో బట్టలు, సామాన్లను అందించడానికి సిద్దంగా వున్నారు. రాత్రిపూట క్రైస్తవసోదరులు భక్తిశ్రద్దలతో ర్యాలీలు నిర్వహిస్తు ప్రార్ధనలు చేస్తున్నారు.

## నేత్ర దేవత ఆలయంలో ఆర్‌వో ప్లాంటుకు భూమిపూజ

నగరి, డిసెంబరు 24 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని నేత్ర దేవత దేశమ్మ దేవాలయం మంత్రి రోజా చొరవతో జీర్ణోద్ధారణ గావించి పునరుద్ధరణ చేస్తున్న సంగతి విధితమే. ఇప్పటికే ఆలయ నిర్మాణం దాదాపు పూర్తయింది. ఆలయ అభివృద్ధిలో భాగంగా మంత్రి రోజా సహకారంతో తుడా నిధులు రూ.7 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసే ఆర్‌వో ప్లాంటుకు ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు భూమిపూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం మంచి నీటిని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ సి.కె.దయానిధి, నాయకులు ధనపాల్‌రెడ్డి, వెంకటేశులు, శశికుమార్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీవారి చక్రస్నానం



వడమాలపేట, డిసెంబరు 24 ప్రభాతవార్త:
వైకుంఠ ద్వాదశి సందర్భంగా అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి చక్రస్నానం భక్తుల గోవిందనామ స్మరణలతో కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం వేకువ జామున తిరుప్పావైతో స్వామివారిని మేల్కొలిపి ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కోనేరు వద్ద ఉదయం 6-7 గంటల మధ్య ఆలయ అర్చకులు చక్ర తల్వార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం కోనేరు వద్ద చక్ర తల్వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేద మంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ శ్రీవారి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. భక్తులు కోనేరులో స్నానమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అద్భుతం...చిన్నారి యేషిత ప్రతిభ

### -భగవద్గీత పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి



తిరుపతి,డిసెంబర్ 24ప్రభాతవార్త:
నేటి సమాజంలో చిన్నవయస్సు నుంచే పిల్లలను భక్తి ఆధ్యాత్మిక చైతన్యం వైపు తీసుకెళ్ళి, హిందూ సనాతన ధర్మం గురించి విస్తృతంగా ప్రచారం చేయ డానికి వీలుగా సత్యసాయిబాబా సేవాసంస్థ భగవద్గీత పోటీలు నిర్వహించింది. ఆదివారం తిరుపతిలో జరి గిన ఈపోటీల్లో చిన్నారి పి.యేషిత జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. చిన్నారిని నిర్వాహకులు అభినందించి, ప్రశంసాపత్రం, మెమొంటోను బహుక రించారు. ఎంతో అద్భుతంగా భగవద్గీత సారాంశం తెలియజేయడం పట్ల అభినందనలు వెల్లువెత్తాయి.

## గణనాధుని సేవలో సినీ హీరో రాజేంద్రప్రసాద్



కాణిపాకం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:
ప్రముఖ సినీ హీరో డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం

సూళ్లూరుపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ వ్రతాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్వామివారి విగ్రహానికి శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య హనుమత్ వ్రతాన్ని ప్రారంభించి మధ్యాహ్నానికి ముగించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు దివి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి సింధూరపూజ నిర్వహించి వ్రతాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ అయితా శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి పాల్గొనగా, ఈ వ్రతానికి ప్రియవర్ధన్‌బాబు, లావణ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## వాకర్స్ గవర్నర్‌గా రావిళ్ల మాధవనాయుడు

పుత్తూరు, డిసెంబరు 24 ప్రభాతవార్త :



నియామక పత్రం అందుకుంటున్న మాధవనాయుడు

పుత్తూరు పట్టణంలోని వాకర్స్ క్లబ్‌కు చెందిన రావిళ్ల మాధవనాయుడు డిస్ట్రిక్ట్ 302 ఇంటర్నేషనల్ వాకర్స్ గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఇంటరే్నషనల్ వాకర్స్ 32వ వార్షికోత్సవంలో ఈయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి సంబంధించిన నియామక పత్రాలను ఇంటరే్నషనల్ వాకర్స్ అధ్యక్షుడు డాక్టర్ సుంకర రవీంద్ర మాధవనాయుడుకు అందించారు. దీంతో ఇకపై కేరళ, తమిళనాడు, కర్నాటక, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ మొత్తం అయిదు రాష్ట్రాల్లోని 126 క్లబ్‌లకు సంబంధించి ఈయన గవర్నర్‌గా వ్యవహరిస్తారు. 2018లో పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మాధవనాయుడు మెగా వైద్య శిబిరం, చెట్ల పెంపకం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాటిని పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు లేకుండా ఈయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇంటరే్నషనల్ వాకర్స్ ప్రధాన సలహాదారు డాక్టర్ పి.రవిరాజు, ఏరియా 3 వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్ రాజు, సమన్వయకర్త కోనేటి రవిరాజు, పుత్తూరు వాకర్స్ క్లబ్ కార్యదర్శి మునికృష్ణయ్య, రీజనల్ కౌన్సిలర్ ప్రతాప్ పలు వాకర్స్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకలకు హోలీ చర్చి ముస్తాబు

కోట,డిసెంబర్ 24 ప్రభాతవార్త



ఆధ్యాత్మిక శోభ .. ప్రకృతి రమణీయతల నడుమ భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తోంది.కోట మండలం విద్యానగర్‌లోని హోలీ ప్రేయర్ చర్చి. ఈ ప్రాంతంలో మహా దేవాలయంగా ప్రసిద్ధిగాంచిన చర్చిగా రూపాంతరం చెందింది.ఈ చర్చిను రెవరెండ్ డా.ప్రదీప్ కుమార్ ఏంతోగాను అభివృద్ధి చేశారని చెప్పవచ్చును.ఈ చర్చి ద్వారా ప్రదీప్ కుమార్ ఏన్నో సేవ కార్యక్రమాలను ప్రజలకు చేశారని పేర్కొన వచ్చును.నిత్యం పరిశుద్ధ దైవారాధన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.ఈ నెల 24 న ప్రారంభమైన ఈ వేడుకలు నూతన సంవత్సరం నిర్వహించే సంబరాలతో ముగుస్తాయి. ప్రతీ మంగళ, శుక్రవారల్లో పశువుల పాక, ఆరాధన, క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# కళ్యాణ వెంకన్న ఆలయంలో వైకుంఠ ద్వాదశి 'చక్రస్నానం'

## పుష్కరిణీలో స్నానానికి పోటెత్తిన జనసందోహం

చంద్రగిరి, డిశంబర్ 24 పభాతవార్త:
కళ్యాణ వెంకన్న ఆలయంలో వైకుంఠ ద్వాదశి రోజున చక్రస్నానం వైభవోపేతంగా జరిగింది. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారి చక్రత్తాళ్వార్‌ను ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగింపు గావించి ఆలయ పుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు పుష్కరిణీ వద్ద సుదర్శన చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, గంధంతో అభిషేకం చేశారు. శ్రీవారి సుదర్శన చక్రంకు (చక్రత్తాళ్వార్‌కు) పుష్కరిణిలో స్నానం నిర్వహించే ముందు చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణీ జలాల్లో ముంచి స్నానం చేయించారు. ఆ దివ్యాయుధ స్పర్శ వలన పుష్కరిణి జలానికి మరింత పవిత్రత లభిస్తుంది. అట్టి పుష్కరిణీలో భక్తజనం స్నానమాచరించడం వలన సకల పాపహరణం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి వీరబ్రహ్మం, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఇఓ యం.గోపీనాధ్, సూపరింటెండెంట్ నర్రా మునిచంగల్రాయులు, ఆలయ అర్చకులు నారాయణాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# గోవిందనామస్మరణతో మార్మోగిన కల్యాణవేంకన్న ఆలయం





స్వామి వారి సేవలో మంత్రి రోజా, ద్వాదశి ద్వార ప్రవేశం చేస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం, డిసెంబర్ 24 ప్రభాతవార్త : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకోని మరుసటి దినమైన ఆదివారం ఉదయం నారాయణవనంలో వెలసిన పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో ఉత్తర ద్వాదశి ద్వారం ప్రవేశానికి వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం 8గంటలకు శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరున్ని ఆలయంలోనే శ్రీవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవారికి హారతులు పట్టారు. వేలసంఖ్యలో భక్తులు తరలి రాగా ముందస్తుగా స్థానిక పోలీసులు, టిటిడి విజిలెన్స్ అధికారులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటల నుంచే ఉత్తర ద్వాదశి ద్వారా ప్రవేశం కోసం భక్తులు సర్వదర్శన, 20 రూపాయాల ప్రత్యేక క్యూలైన్‌లోకి అనుమతించారు. దీంతో గంటల తరబడి క్యూలైన్‌లోనే నిరీక్షించారు. గతంలో స్వామివారిని మధ్యాహ్నం 1గంట వరకు ఉత్తర ద్వారం వద్ద వుంచి భక్తులకు దర్శనం కల్పించేవారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అసహనానికి గురైనారు. అంతకుముందు ఆలయాన్ని టిటిడి అధికారులు వివిధ రకాల పూలతో సుమనోహరంగా అలంకరించారు. శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరున్ని తిరుచ్చివాహనంపై అధిరోహించి ఊరేగించారు. అక్కడ నుంచి ఉత్తర ద్వాదశి ద్వారం వద్దకు అమ్మవార్లను, స్వామివారిని తీసుకొచ్చి సర్కారుహారతి ఇచ్చిన తర్వాత భక్తులకు ద్వాదశి ద్వారా ప్రవేశం కల్పించారు. ద్వాదశి ద్వారం చేసుకున్న వారిలో రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో

## జాయింట్ కలెక్టర్ డికే బాలాజీకి ఆత్మీయ వీడ్కోలు

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 24, ప్రభాతవార్త



జాయింట్ కలెక్టర్ డికె బాలాజీని సన్మానిస్తున్న కలెక్టర్

తిరుపతి కొత్త జిల్లాగా ఏర్పడిన తర్వాత మొదటి జాయింట్ కలెక్టర్‌గా డికె బాలాజీ విధుల్లో చేరిన 20 నెలల కాలంలో ఎన్నో పరిష్కారాలు చూపించారని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో గతంలో తిరుపతి జేసిగా విధులు నిర్వహించి ఆరోగ్యశ్రీ సిఈఓగా బాధ్యతలు చేపట్టిన డికె బాలాజీకి జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్, డిఆర్ఓ పాల్గొని ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో గుర్తుండిపోయేది అధికారిగా విధులు నిర్వహించిన చోట గొప్పగా పని చేసి ఒక బెంచ్ మార్క్ ఏర్పాటు చేసి ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు సూచనలు ఇస్తూ అనుకున్న పనులను త్వరితగతిన పూర్తి చేయడం వంటివి చేపట్టడంలో డికె బాలాజీ ముందు వరుసలో ఉన్నారని కొనియాడారు. తాను పని చేసిన 20 నెలల కాలంలోనే రీ సర్వే సాదా బైనామా, సివిల్ సప్లై, నేషనల్ హైవేస్ వంటి వాటిలో తన ప్రతిభను చూపించి పరిష్కరించారని అన్నారు. జిల్లా అధికారులు, ఆర్డిఓలు, మండల అధికారులు జెసి సేవలను కొనియాడుతూ వారిని స్ఫూర్తిగా అందరూ అలవర్చుకోవాలని తెలిపారు. ఈ ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో కలెక్టరేట్, రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 6వ రాష్ట్రస్థాయి అండర్-15 బాలబాలికల రెజ్లింగ్

### చాంపియన్‌షిప్‌లో తిరుపతి జిల్లా విద్యార్థుల ప్రతిభ

నాయుడుపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త



6వ రాష్ట్రస్థాయి అండర్-15 బాల బాలికల రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో 23, 24వ తేదీల్లో జరిగాయి. ఇందులో తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన క్రీడాకారులు మూడు బంగారు పతకాలు, ఆరు వెండి పతకాలు, నాలుగు కాంస్య పతకాలు గెలిచి ఓవర్ ఛాంపియన్‌షిప్ సాధించారు. వీరిలో పసల కార్తీక్, సిహెచ్ సోము, ఇ.గిరిప్రతాప్ బంగారు పతకాలు సాధించి ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ గుండాలో జరిగే జాతీయ స్థాయిలో పాల్గొంటారని ప్రెసిడెంట్ ఎన్.సురేష్, కార్యదర్శి బి.ఉదయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రవిరెడ్డి, సుదీప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరి దారా రవి, టీమ్ కోచ్ డి.లీలమోహన్, జ్యోతి ప్రకాష్, మేనేజర్ సుధా తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్దుని సేవలో పలువురు సుప్రీం, హైకోర్టు జడ్జిలు



సుప్రీంకోర్టు జడ్జిలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ

కాణిపాకం,డిసెంబర్ 24 ప్రభాతవార్త:
పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఈమేరకు సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ ఎస్.వి.భట్టి, జస్టిస్ బి.వి.నాగరత్న, కర్నాటక హైకోర్టు జడ్జి జస్టిస్ హేమలేఖలు కుటుంబసమేతంగా వేర్వేరుగా కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి రమేష్, చిత్తూరు ఏఎస్పీ సుధాకర్, ఆర్డీఓ చిన్నెయ్య, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, స్థానిక ఎస్సై శ్రీనివాస్, ఐరాల తహశీల్దార్ ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు, కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విష్ణుషలతో పాటు ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిచే శ్రీ భక్త కనకదాస విగ్రహావిష్కరణ

కుప్పం, డిసెంబర్ 24 ప్రభాతవార్త



కురబ కులస్తుల ఆరాధ్యదైవం శ్రీ భక్త కనకదాస విగ్రహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రి కూడలిలో రాష్ట్ర అటవీ,గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. కుప్పంలో కురబకులస్తుల దైవం కనకదాస విగ్రహం ఏర్పాటుచేయడం హర్షణీయమన్నారు. ఇందుకు చొరవ చూపిన ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్‌ను అభినందించారు. అలాగే పరమసముద్రం మార్గంలో ముస్లిం మైనార్టీ సోదరుల మదరసా నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపిలు రెడ్డెప్ప, గోరంట్ల మాధవ్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్, కురబ, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 24 ప్రభాతవార్త
ఈ నెల 17న శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం సమీపంలోని చుక్కలనిడిగల్లు పంట కాలువలో ఓ యువతి శవాన్ని గుర్తించారు. అదే రోజు అమ్మపాళెం వి.ఆర్.ఓ బాలసుబ్రమణ్యం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.ఆయన ఫిర్యాదు మేరకు సిఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాలలో విచారణ జరిపారు. కానీ ఈ ప్రాంతం మహిళ కాదని తేలింది. దాంతో చుట్టుపక్కల పోలీసు స్టేషన్లతో పాటు సరిహద్దులోని తమిళనాడు పోలీసులకు సమాచారం అందించారు. ప్రత్యేక దళాలను ఏర్పాటు చేసారు.తిరుపతిలోని మహిళా పోలీసులకు సమాచారం అందించారు.

**దిండుతో ఊపిరి ఆపి చంపారు.:**

శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం సమీపంలోని పంట కాలువలో గుర్తుతెలియని శవంగా గుర్తించిన పోలీసులు ఆ శవం విద్యాలతది అని గుర్తించామని ఈ మేరకు తల్లిదండ్రులు ధృవీకరించినట్లు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డివైయస్‌పి బీమారావు తెలిపారు. సిఐ అజయ్‌కుమార్ వారి సిబ్బంది ఎంతో చొరవ చూపి ఈ కేసును నాలుగు రోజుల్లో ఛేదించారని డివైయస్‌పి అభినందించారు. విద్యాలత(23)ను చంపటానికి గల కారణాలను వివరించారు.తిరుచానూరుకు సమీపంలోని కొత్తపాళెం యానాది కాలనీలో నివశించు శశికుమార్(26)ను ప్రేమించి సహజీవనం గడుపుతున్నట్లు తమ విచారణలో తేలిందని డివైయస్‌పి వివరించారు. అయితే శశికుమార్‌కు అదే కాలనీకి చెందిన మరో యువతి సుజాతతో సుమారు 8 సంవత్సరాల నుంచి వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిందన్నారు. అయితే కొత్తగా సంబంధం పెట్టుకున్న విద్యాలతకు సుజాతకు తరచూ గొడవలు జరిగేవని తెలిసింది.శశికుమార్ తల్లి లీలావతి సుజాతకు మద్దతుగా ఉండేదని వివరించారు. తమ జీవితాలు బాగుపడాలంటే తాము విదేశాలకు వెళ్ళాలని విద్యాలత, శశికుమార్‌లు సమాలోచనలు చేసుకున్నట్లు కూడా తెలిసిందన్నారు. అయితే ఇది నచ్చని సుజాత,లీలావతి విద్యాలత అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇంటో శశికుమార్‌లేని సమయంలో ఇద్దరు కలసి విద్యాలతను దిండుతో అదిమి ఊపిరాడక చేసి హతమార్చినట్లు తమ విచారణలో తేలిందన్నారు. చంపేసిన వారు విద్యాలత శవాన్ని ఓ ప్లాస్టిక్ సంచిలో దురిమి ఓ ఆటోనుమాట్లాడుకున్నారు.ఇంటి సామాన్లు అని నమ్మబలికారు. లీలావతికి ఈ ప్రాంతాలతో సంబంధం ఉన్నట్లు తెలిసిందన్నారు. ఆటో లో సంచిని పెట్టుకొని వస్తూ మిట్టకండ్రిగ వద్ద రాగా తొండమనాడు వైపుకు తిప్పమని పంట కాలువ వద్ద దించుకొని ప ంట కాలువ లో పడేసి నట్లు నేరం చేసిన వారు వివరించినట్లు తెలిపారు.అక్కడ నుంచి లీలావతి,సుజాతలు మిట్టకండ్రిగ దగ్గరకు వచ్చి అక్కడ నుంచి బస్సు ఎక్కి ఇంటికి వెళ్ళి విద్యాలత దగ్గర ఉన్న సెల్‌ఫోన్, నగలను ఇంటిలో దాచి పెట్టారని భయపడి నారాయణ పురం విఆర్ఓ కిరణ్ వద్ద లొంగిపోయినట్లు డివైయస్‌పి బీమారావు వివరించారు. హత్యజరిగిన ఇంటిని పరిసర ప్రాంతాలను సిఐ అజయ్‌కుమార్ వారి సిబ్బంది పర్యవేక్షించారని తెలిపారు.ఈ కేసులో ప్రధాన నిందితులైన సుజాత(36)ఎం.లీలావతి (50) అరెస్టు చేసినట్లు వివరించారు. కేసును ఛేదించటంలో చొరవ చూపి సిఐ అజయ్‌కుమార్,ఎ ఎస్ఐ రాజు కానిస్టేబుల్స్ వేమారెడ్డి, ఉదయ్‌కుమార్,ధనంజయ, భరత్, నాగరాజులు కేసును ఛైదించటం అభినందనీయం అన్నారు.వారికి రివార్డు కోసం ఎస్‌పికి నివేదిక పంపుతున్నట్లు డివైయస్‌పి బీమారావు వివరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డివైయస్‌పి బీమారావు

## ఏరియా ఆస్పత్రి వైద్యుల మానవతా దృక్పధం

### -సాధువుకు సొంతఖర్చులతో వైద్యం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి అంటేనే నిర్లక్ష్యం జబ్బు అని, మరోవైపు సరైన వైద్యసౌకర్యాలు అందించడం లేదు, కనీసం రోగులను చేయిపట్టుకుని చూసే పరిస్థితుల్లో కూడా వైద్యులులేరన్న అపవాదు ఉండేది. అయితే నేడు వందపడకల ఆస్పత్రిని 150 పడకల ఆస్పత్రిగా మార్చారు. ఈనేపధ్యంలో శ్రీకాళహస్తి పట్టణం నుంచే కాకుండా పలువు గ్రామీణ ప్రాంతాలు, ఇతర మండలాల నుంచి వైద్యసేవలు పొందేందుకు ఇక్కడకు వందలాది మంది రోగులు వస్తుంటారు. అయితే ఇక్కడ ఆస్పత్రిలో చేరిన రోగులకు ఆపరేషన్లు చేయాలంటే ముఖ్యపాత్ర అనస్తీషియా వైద్యునిదే. రోగులకు మత్తు ఇవ్వనిదే ఆస్పత్రిలో ఆపరేషన్లు జరగవు. ఈనేపధ్యంలో చెన్నైలోని తిరువత్తూరుకు చెందిన రవిచంద్రన్(50) గత పది సంవత్సరాల నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద సాధువుగా ఉంటూ భక్తుల వద్ద నుంచి బిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇటీవల కొద్దిరోజుల క్రితం ఆలయం వద్ద పడిపోగా గుర్తించిన స్థానికులు, దుకాణదారులు వెంటనే 108కు పోన్ చేయడంతో సాధువును ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అన్ని పరీక్షలు చేసిన వైద్యులు కుడికాలు విరిగిందని చెప్పడంతో ఆస్పత్రిలో మంచిపేరున్న వైద్యుడుగా గుర్తింపు తెచ్చుకున్న కీళ్ళు, ఎముకల శస్త్రచికిత్స చేసే వైద్యులు డాక్టర్.జయగోపాల్ మానవతా దృక్పధంతో స్పందించి సాధువుకు తన సొంతఖర్చులతో విరిగిన కాలుకు ప్రత్యేకంగా తయారుచేసిన రాడ్డును కొనుగోలు చేసి ఆపరేషన్ చేసి అమర్చడంతో సాధువు కోలుకుంటున్నారు. ఆపరేషన్‌ను విజయంతం చేయండంతో అనస్తీషియా వైద్యులు డాక్టర్ కె.చక్రపాణి, కీళ్ళు, ఎముకల వైద్యనిపుణులు సి.జయగోపాల్, పిజి.డాక్టర్ విష్ణులతోకలసి ఆపరేషన్‌ను విజయవంతం చేశారు.



## కాణిపాకం ఆలయంలో వెండి తొడుగులు అప్పగింత

### -ఏర్పాటు పనులు ప్రారంభం



కాణిపాకం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం ద్వారాలు తలుపులకు చేయిస్తున్న వెండి తాపడం పనులకు సంభందించి వెండి తొడుగులను ఆలయ పునర్నిర్మాణ దాతలు ఆలయానికి ఆదివారం అందజేశారు. సుమారు వెయ్యేళ్ళ చరిత్ర కలిగిన సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయాన్ని దాతలు ప్రవాస భారతీయులైన విజయవాడకు చెందిన ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్‌లు సుమారు 10 కోట్లు రూపాయలతో శిల్పకళ ఉట్టిపడే విధంగా పునర్నిర్మాణ చేసి గతేడాది భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే వారు నూతన ఆలయం ద్వారాలు తలుపులకు సుమారు 6.60 కోట్లు రూపాయలతో బంగారు, వెండి తాపడం పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు ఆలయంలోని గర్భాలయం, అంత్రాలయం ద్వారాలకు 3.50 కోట్లు రూపాయలతో బంగారు తాపడం, మూడు కోట్లు రూపాయలతో అర్ధమండపం ద్వారాలకు వెండి తాపడం పనులు చేసేందుకు ముందుకు రావడంతో గత కొద్ది రోజులుగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా వెండి తాపడం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈమేరకు దాతలు ఐకా.రవి, గుత్తికొండ శ్రీనివాస్, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్‌లు సుమారు 340 కిలోల వెండి తొడుగులను అమర్చేందుకు ఆలయానికి అందజే శారు.దాతలు తమ ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ ద్వారా ఈఓ వెంకటేశుకు అందజేశారు.ఈమేరకు ఆలయంలో వెండి తొడుగులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ద్వారాలకు అమర్చే పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ స్యువలరీ వెరిఫికేషన్ అధికారి వాణి, మాజీ సీఏఫ్ఓ నాగేశ్వరరావు,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విష్ణుష్ తదితరులు పాల్గొన్నారు.